

చింతపండు @ 25 వేలు

హిందూపురం మార్కెట్‌లో గురువారం క్వింటా చింతపండు గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, నగటున రూ.10 వేల ప్రకారం ధర పలికింది.



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.9°/13.2°

జిల్లా పరిధిలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భాష్యం పాఠశాల సీజ్



భాష్యం పాఠశాలను సీజ్ చేస్తున్న డీఈఓ మీనాక్షి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు, క్యాంపెయిన్లు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని డీఈఓ మీనాక్షి హెచ్చరించారు. గురువారం పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ముందస్తు అడ్మిషన్లకు ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. పాఠశాలను పరిశీలించి అనుమతులు లేకపోవడంతో పాఠశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ, అడ్మిషన్లు, ప్రచారాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించే పాఠశాలలను సీజ్ చేస్తామన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ-1 ప్రసన్న లక్ష్మీ ఉన్నారు.

గంజాయి సాగుకు కఠిన శిక్ష

- వ్యక్తికి నాలుగేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా



పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ, సిబ్బంది (ఫైల్)

పరిగి: గంజాయి సాగు చేసినట్లు నిర్ధారణ కావడంతో ఓ వ్యక్తికి 4 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. అలాగే, రూ. 10 వేల జరిమానా విధించారు. ఈ మేరకు స్థానిక ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి టి. హరిత గురువారం సంచలన తీర్పు వెలువరించారు. ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ తెలిపిన మేరకు.. పరిగి మండలం ఎర్రగుంట పంచాయతీ నేతలపల్లి గ్రామానికి చెందిన వై. నారాయణప్ప (48) తన వ్యవసాయ పొలంలో అంతర పంటగా గంజాయి పెంచేవాడు. విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 2019 సెప్టెంబర్ 14న మడకశిర ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపవరం లక్ష్మీనారాయణ రెడ్డి కేసును వాదించారు. వై. నారాయణప్ప గంజాయి మొక్కలు సాగు చేసినట్లు నిర్ధారణ కావడంతో జడ్జి హరిత గురువారం తీర్పు చెప్పారు. నిందితుడికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు.

బాధ్యతల స్వీకరణ



కమాండెంట్ అమిత్ బర్దర్‌కు స్వాగతం పలుకుతున్న ఏసీ నాగేశ్వరప్ప

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా అమిత్ బర్దర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, పోలీసు అసోసియేషన్ సంఘం అధ్యక్షులు పెద్దయ్య, వైస్ ప్రెసిడెంట్ ఏఆర్ ఎస్ఐ శ్రీనివాసులు, కోశాధికారి మాదన్నలు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమాండెంట్ అమిత్ బర్దర్ మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సిబ్బందికి సమస్యలుంటే పరిష్కరిస్తానన్నారు. కాగా, ఇటీవల కమాండెంట్‌గా పని చేస్తున్న గంగాధర్ రావు విజయవాడ సీఐడీ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. సీఐడీలో ఎస్పీగా పని చేస్తున్న అమిత్ బర్దర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

12న అప్రెంటిస్‌షిప్ మేళా



అనంతపురం ఎడ్యుకేషన్: ఒకేషనల్ విద్యార్థుల కోసం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్య అధికారి వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, గతేడాది ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అన్ని మేనేజ్‌మెంట్ల కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఒకేషనల్ లెక్చరర్లు తప్పనిసరిగా సమాచారం చేరవేసి హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

నులిమేద్దాం



- పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు నులి పురుగులతో ఆటంకం
- నులి పురుగులకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చర్యలు
- నేటి నుంచి 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



సాక్షి, పుట్టపర్తి: పిల్లల్లో రక్తహీనత, కడుపునొప్పి, వాంతులు, శారీరక, మానసిక ఎదుగుదల తదితర సమస్యలకు ఒక్క మాత్రతో చెక్ పెట్టవచ్చు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారుల్లో శారీరక ఎదుగుదలకు ప్రధాన కారణంగా నులి పురుగులుగా చెప్పవచ్చు. పేగులో ఉండే పరాన్న జీవి మనం తీసుకునే ఆహారాన్ని గ్రహించి రక్తహీనత, పోషకలేమి సమస్యను సృష్టిస్తుంది. ఈ క్రమంలో నులి పురుగుల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రక్తహీనతకు చెక్ పెట్టే క్రమంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ముమ్మరం చేసింది. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

వయసు ఆధారంగా మోతాదు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఆల్బెండజోల్ మాత్రల బాక్సులను సిబ్బందికి అందజేశారు. ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మాత్రలు పంపిణీ చేస్తారు. ఏడాది నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర, మూడు నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఒక మాత్ర వేయాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వైద్య సిబ్బంది సూచన మేరకు మాత్రమే మాత్ర వేయాలని సూచించారు.

అనర్థాలు ఇవే..

రక్తహీనత ఉన్న వారిలో ఆకలి లేకపోవడం, బలహీనంగా, నీరసంగా, ఆందోళనగా ఉండటం వంటి సమస్యలు కనిపిస్తాయి. తరచుగా కడుపునొప్పి రావడం, వికారంగా ఉండటంతో పాటు విరేచనాలు, మలంలో రక్తం వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వయసు వారికి నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. నులిపురుగుల నివారణకు అవసరమైన మాత్రలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ప్రతి ఆరు నెలలకు మాత్రల పంపిణీ జరుగుతోంది.

శారీరక ఎదుగుదలకు అవరోధం

చిన్నారుల అనారోగ్య సమస్యలకు మూల కారణం పేగుల్లో ఏలిక పాములు, నులి, కొంకి పురుగులు సంక్రమించడమేనని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు తినే ఆహారాన్ని పొట్టలోని పేగులో నుంచి నులి పురుగులు తీసుకుంటాయి. పిల్లలు తినే ఆహారంతోనే నులి పురుగులు వృద్ధి చెందుతాయి. ఫలితంగా పిల్లలకు పౌష్టికాహారం అందకుండా పోతుంది. దీంతో రక్తహీనత ఏర్పడి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో పిల్లలు శారీరకంగా, మానసికంగా వృద్ధి చెందలేకపోతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పిల్లలు ఎప్పటికప్పుడు చేతిగోళ్లు శుభ్రంగా ఉంచుకోవాలి. కలుషిత నీరు తాగకూడదు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జనకు వెళ్లకూడదు. కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతనే వంటకు వాడుకోవాలి. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి. భోజనానికి ముందు చేతులను సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలి.

జిల్లా గణాంకాలు	
జిల్లాకు చేరిన ఆల్బెండజోల్ మాత్రల సంఖ్య	4,80,000
జిల్లాలో 19 ఏళ్ల లోపు వారి సంఖ్య	3,47,171 మంది
విధుల్లో పాల్గొనే ఏఎన్ఎంలు	540 మంది
సూపర్‌వైజర్లు	82 మంది
అర్బన్ మెడికల్ ఆఫీసర్లు	18 మంది
రూరల్ మెడికల్ ఆఫీసర్లు	94 మంది
ఆశా వర్కర్లు	1,506 మంది
సీహెచ్ఓ/ఎంపీహెచ్ఈఓలు	47 మంది

అవగాహన కల్పించాం



జిల్లాలో నులి పురుగుల నివారణ మాత్రలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించాం. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలి. మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తాం. జిల్లాకు మొత్తం 4,80,000 ఆల్బెండజోల్ మాత్రలు వచ్చాయి.

– ఎస్‌వీ కృష్ణారెడ్డి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

లక్ష్యం పూర్తి చేస్తాం



ఒకే రోజులో వంద శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని నిర్దేశించారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం పూట ఏర్పాట్లు చేస్తాం. మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రలను పంపిణీ చేస్తాం. వైద్యులు, ఆశా వర్కర్ల సూచన మేరకు మాత్రలు వినియోగించాలి.

– నివేదిత, నులి పురుగుల నివారణ ప్రోగ్రామ్ ఆఫీసర్, పుట్టపర్తి

23 మంది ఎస్‌ఐల బదిలీ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 23 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐ) లను బదిలీ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వీఆర్‌లో ఉన్న 21 మందిని బదిలీ చేశారు. పూర్యానాయక్ (కదిరి అర్బన్), నారాయణప్ప (సీసీఎస్), సరస్వతి (పుట్టపర్తి దిశ స్టేషన్), రెడ్డెప్ప (ధర్మవరం టూటౌన్), యతిరాజులు (దిశ, పుట్టపర్తి) , రెడ్డినాయక్ (దిశ, పుట్టపర్తి) , బాలాజీ (గోరంట్ల అర్బన్), విశ్వనాథనాయుడు (స్పెషల్ బ్రాంచి), నిత్యానంద పిల్లై (డీసీఆర్‌బి), సుమతి (దిశ, పుట్టపర్తి), భువనేశ్వర్ (పుట్టపర్తి సెక్యూరిటీ వింగ్), విజయలక్ష్మి (దిశ, పుట్టపర్తి), మూర్తి (హిందూపురం టూటౌన్), గౌరీ శంకర్ (హిందూపురం అర్బన్), వసుంధరాదేవి (డీసీఆర్‌బీ, పుట్టపర్తి), శ్రీదేవి (పుట్టపర్తి ఎయిర్‌పోర్టు), సత్యనారాయణ(పరిగి), ఇస్మాయిల్‌ఖాన్ (సీసీఎస్, పుట్టపర్తి), వెంకటరమణ (సీసీఎస్, పుట్టపర్తి), ముక్బూల్ బాషా (సీసీఎస్, పుట్టపర్తి), భాస్కర్ ప్రసాద్ రాజు (సీసీఎస్, పుట్టపర్తి) ఉన్నారు. ఇక నరేంద్ర పరిగి నుంచి ధర్మవరం రూరల్, జనార్ధననాయుడు సీసీఎస్ నుంచి అమరాపురంలను బదిలీ చేశారు.

పలువురు తహసీల్దార్లకు స్థానచలనం

కదిరి: జిల్లాలో 11 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ గురువారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ జిల్లా ఓబులవారిపాలెం తహసీల్దార్‌గా ఉన్న వీ.పుల్లారెడ్డిని కదిరికి బదిలీ చేశారు. రెండు రోజుల క్రితం కదిరి తహసీల్దార్‌గా రామనాథరెడ్డిని నియమించినప్పటికీ నియోజకవర్గ కేంద్రం కావడంతో ఎన్నికల విధుల్లో తనకు అనుభవం లేదనే కారణంతో ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ఆయనను అమడగూరుకు బదిలీ చేశారు. కదిరి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయిన కాటం బాబు స్థానికుడు కావడంతో ఆయన్ను పెనుకొండ ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా బదిలీ చేశారు. ఈయన స్థానంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన పీవీ రమణను నియమించారు. అలాగే నంద్యాల జిల్లా మిడుతూరు మండల తహసీల్దార్‌ను మడకశిరకు, ఇక్కడున్న ఎ.వెంకటేశ్వర్లును అగళికి బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పి.భారతిని బుక్కపట్నంకు, డి.శ్రావణని గాండ్లపెంటకు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా పెద్ద మండ్యం తహసీల్దార్ జె.రామును రామగిరికి, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు తహసీల్దార్ ఎస్.రవికుమార్, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో పని చేస్తున్న ఎం.వెంకటస్వామిని కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

పునాది లేని దేవాలయం లేపాక్షి ఒక్కటే

- శాస్త్రీయ పద్ధతుల్లో చిత్రలేఖనాలను శుభ్రపరచాలి
- యునెస్కో గుర్తింపు కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం
- ఇంటాక్ ఛైర్మన్ ఎల్‌కే.గుప్తా



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ఇంటాక్ ఛైర్మన్ తదితరులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో ఉన్న పెయింటింగ్స్ (చిత్రలేఖనాల)ను భారతీయ శాస్త్రీయ పద్ధతుల్లో శుభ్రపరిచాలని ఇంటాక్ (అఖిల భారత కళలు, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ ట్రస్టు) ఛైర్మన్ ఎల్‌కే.గుప్తా తెలిపారు. గురువారం సాయంత్రం లేపాక్షి ఆలయాన్ని ఇంటాక్ ఛైర్మన్‌తో పాటు అనంతపురం జిల్లా కన్వీనర్ రామ్‌కుమార్, కోకన్వీనర్ చంద్రహాసరెడ్డి, పూర్వ కన్వీనర్ ఏజీ వేణుగోపాల్, పురావస్తు, మ్యూజియం ఏడీ రజిత, ఇంటాక్ కెపాసిటి బిల్డర్ కృష్ణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేపాక్షి ఆలయంలో బ్రిటిష్ కాలం నాటి కాలంలో చిత్రీకరించిన చిత్రలేఖనాలు కొంత వరకు మాసిపోయాయని, వాటిని ఇప్పుడు రసాయనిక పద్ధతుల్లో శుభ్రపరచడం వలన ప్రయోజనం లేదన్నారు. తమ ట్రస్ట్ ద్వారా ఒక చోట శాస్త్రీయ పద్ధతుల్లో పెయింటింగ్స్ వేసి చూపిస్తామని, ఆ పెయింటింగ్స్ బాగుంటే ప్రభుత్వం నిధులు సమకూరిస్తే ఆలయంలో ఉన్న పెయింటింగ్స్ పూర్తి చేస్తామన్నారు. దేశ చరిత్రలో పునాది లేని దేవాలయం లేపాక్షి ఒక్కటేనని స్పష్టం చేశారు. ఈ ఆలయం ఇప్పటి వరకూ యునెస్కో గుర్తింపుకు నోచుకోలేదన్నారు. లేపాక్షిని తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్నా శాశ్వత గుర్తింపు కోసం ఎవరు ప్రయత్నించలేదని తెలిపారు. లేపాక్షిని యునెస్కో గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తుది జాబితా తర్వాత 30 వేల దరఖాస్తులు

- గోరంట్ల, లేపాక్షిలో కౌంటింగ్ కేంద్రాలు
- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా ఎన్నికల అధికారి అనుమతితోనే ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపు కోసం వచ్చిన క్లైములను పరిష్కరించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా అందరూ పనిచేయాలని సూచించారు. నూతన జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఎన్నికలకు అందరి సహకారం అవసరమన్నారు. తుది ఓటరు జాబితా విడుదల అనంతరం సుమారు 30 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని ఈఆర్‌ఓలను ఆదేశించామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులను పరిష్కరించుకుంటూ స్వచ్ఛీకరించడంలో అధికారులు చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యులు కావాలన్నారు. ఏమైనా తొలగింపులు ఉంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే తొలగింపులు చేపడతామన్నారు. ఫారం 6, 7, 8 లపై పారదర్శకంగా విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజక వర్గాలకు గోరంట్లలోని మాంటిస్సోరి హైస్కూల్, హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజక వర్గాలకు లేపాక్షి సమీపంలోని చోళసముద్రం అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

జగనన్న కాలనీలతో పాటు స్వంత స్థలాల్లో చేపట్టిన ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి హౌసింగ్ నిర్మాణాలు, రీ సర్వే, అసైన్డ్ భూములు, ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ కుమార్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో వీసీ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖ చుక్కల భూములు, ఇనాం భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు.

గుత్తి డీజిల్‌షెడ్‌కు జాతీయస్థాయి గుర్తింపు



గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్



గుత్తి డీజిల్ లోకో షెడ్ (ఫైల్)

గుంతకల్లు: గుత్తి డీజిల్ లోకో షెడ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సిబ్బంది అత్యుత్తమ పనితీరుతో ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ పరంగా దక్షిణ మధ్య రైల్వే డివిజన్ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు గురువారం డీఆర్ఎం వినీత్ సింగ్ తెలిపారు. కాజీపేట డీజిల్ లోకోషెడ్ మొదటి స్థానంలో ఉందన్నారు. గుత్తి డీజిల్ లోకోషెడ్‌లో దాదాపు 90 డబ్ల్యూ, ఏజీ-9 ఎలక్ట్రిక్ లోకోలు ఉండగా, డివిజన్ వ్యాప్తంగా దాదాపు 90 శాతం విద్యుదీకరణ పూర్తి చేసి డీజిల్ ట్రాక్షన్‌తో నడిచే రైలు సర్వీసులను దశలవారీగా విద్యుత్ ట్రాక్షన్‌తో నడుపుతున్నట్లు డీఆర్ఎం వెల్లడించారు. ఈ విషయంలో అతి తక్కువ వైఫల్యాలు కలిగి ఉండడంతో జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. త్వరలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా పురస్కారంతో పాటు నగదు బహుమతి అందుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోకో షెడ్ అధికారులు, సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ప్రత్యేకంగా అభినందినట్లు తెలిపారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

- డీపీటీఓ మధుసూధన్



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీపీటీఓ మధుసూదన్

కదిరి అర్బన్: ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని బైక్ ర్యాలీని డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ డీఎం హరిమోహన్, హరితలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితంగా ఉంటుందన్నారు. అనుభవజ్ఞులైన సిబ్బందితో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటామన్నారు. ఆర్టీసీ ప్రయాణం అంటే సురక్షితమనే భావన అందరిలో ఉందని, ఇంకా మెరుగైన సేవలందించి ప్రయాణికులను పెంచుకోవాలన్నారు. మద్యం, ఇతర వ్యవసనాలకు దూరంగా ఉండాలని సిబ్బందిని సూచించారు. బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ వేమారెడ్డి కూడలి మీదుగా తిరిగి బస్టాండ్ చేరుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, ఆర్టీసీ ఉద్యోగులు బైరిశెట్టి, ఎస్‌వీ రమణ, శంకరప్ప, నబీరసూల్, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

హిందూపురం టౌన్: మార్చిలో జరగనున్న 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో పరీక్షా కేంద్రాలకు తరగతి గదులను డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యంతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని గదులు ఉన్నాయి, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం ఉన్నాయా అని ఆరా తీశారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో ప్రతి గదిలో తప్పనిసరిగా ఫర్నీచర్, లైటింగ్, నీటి సదుపాయం ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గదుల్లో ఫర్నీచర్, లైటింగ్ సౌకర్యాలు లేకపోతే ఏర్పాటు చేయాలని సూచించారు.



హిందూపురం జేవీఎస్ ఫంక్షన్ హాలులో టీడీపీ కండువాలతో చిన్నారులు



చిలమత్తూరులో బాలకృష్ణకు స్వాగతం పలికేందుకు ఎండలోనే నిల్చొన్న చిన్నారులు

పాపం పసివాళ్లు

హిందూపురం అర్బన్: నిత్యం బ్లెడ్డు... బ్రీడు గురించి మాట్లాడే ఎమ్మెల్యే బాలకృష్ణ రాజకీయాల్లో పూర్తిగా దిగజారి పోయారు. అభం.. శుభం తెలియని చిన్నారులను పార్టీ కండవాలు కప్పి అట్టహాసం చేశారు. హిందూపురంలోని జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. అలాగే చిలమత్తూరులో జరిగిన ఓ కార్యక్రమంలో బాలకృష్ణకు స్వాగతం పలకడం కోసం మండుటెండలో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా చిన్నారులు పడిగాపులు కాశారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా రూరల్ ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని 15 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తనకల్లు మండలం గమేనాయక్ తండా, తులుపుల మండలం కుర్లి, తాడిమర్రి మండలం తాడిమర్రి-2, సోమందేపల్లి మండల గుడిపల్లి, రొద్దం మండలం రొద్దం-3లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే పుట్టపర్తి మండలం చోర్లోపల్లి, పరిగి మండలం పైడేటి, నంబూల పులకుంట మండలం పి.కొత్తపల్లి, నల్లచెరువు మండలం ఓరువాయి, కొత్తచెరువు మండలం మైలసముద్రం, కనగానపల్లి మండలం నరసంపల్లి, గుడిబండ మండలం కొనకల్లు, గోరంట్ల మండలం గోరంట్ల-3, చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల-2, బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వలంటీర్లు, ఆశా వర్కర్లు ఇచ్చిన రసీదులు తీసుకుని ప్రజలు ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలలో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆర్‌డీ


కిట్లు అందజేస్తున్న డాక్టర్ అనురాధ

కదిరి టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ గురువారం తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. రికార్డులు, వార్డులు పరిశీలించారు. అనంతరం టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్: మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయ స్వామి ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆలయ ఈవో నరసింహమూర్తి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు స్థానిక దేవదాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న దరఖాస్తులను పూరించి 20 రోజుల్లోపు కర్నూలులోని ఉప కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి. 9 మందిని ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎంపిక చేసి, వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.

గల్లంతైన యువకుడి మృతి

కనగానపల్లి: హంద్రీ–నీవా కాలువలో గల్లంతైన రమేష్ (30) మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం ఆయన మృతదేహాన్ని వెలికి తీశారు. మండలంలోని తగరకుంట సమీపంలోని హంద్రీ–నీవా కాలువలో బుధవారం సాయంత్రం రమేష్ గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో రంగంలో దిగిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దాదాపు 15 గంటలకు పైగా గాలింపు చేపట్టి తగరకుంట సమీపంలోనే కాలువ గట్టున రమేష్ మృతదేహం గుర్తించి వెలికి తీశారు. మృతుడికి భార్య నందిని, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సరిహద్దులో తస్మాత్ జాగ్రత్త!

- తనిఖీ కేంద్రాల్లో వాహనాల జల్లెడ పడుతున్న అధికారులు
- ఎలాంటి మద్యానికి అనుమతులు లేవంటున్న సెబ్ అధికారులు
- రూ.50 వేలకు మించిన నగదుకు రసీదు తప్పని సరి

హిందూపురం అర్బన్: కర్ణాటక బార్డర్ దాటి ఆంధ్రాలోకి అడుగు పెడుతున్నారా? వ్యాపారం, విద్య, ఆరోగ్య, గిఫ్ట్, గోల్డ్ తదితరాలకు సంబంధించిన నగదు, మద్యం మీ వెంట తీసుకెళ్లుతున్నారా? అయితే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోండి. రూ.50 వేలకు మించి నగదు, గిఫ్ట్ (చీరలు, వెండి, బంగారం ఆభరణాలు, క్రీడా సామగ్రి... తదితరాలు) ఉంటే ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్లే. మీరు తీసుకెళుతున్న నగదు సొంతమైనా అవి ఎక్కడి నుంచి వచ్చాయో స్పష్టంగా తెలిసేలా రసీదు ఉండాల్సిందే. లేదంటే పోలీస్‌స్టేషన్‌లు, వివిధ శాఖల చుట్టూ తిరగాల్సి వస్తుంది. కర్ణాటక నుంచి ఆంధ్రలోకి వస్తూనే కొడికొండ, తూమకుంటతో పాటు ఉమ్మడి అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఏర్పాటు చేసిన 19 తనిఖీ కేంద్రాల్లో (చెక్‌పోస్టు)నూ తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల్లో పోలీసు, సెబ్, అటవీ, రవాణా, సేల్స్ ట్యాక్స్, ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలకు సంబంధించి 12 మంది సిబ్బంది అనునిత్యమూ డేగ కళ్లతో పహారా కాస్తున్నారు. తెలిసీ... తెలియక నిబంధనలు అతిక్రమించి చెక్‌పోస్టు మీదుగా నగదు, మద్యం తరలిస్తే కేసు నమోదు చేసేస్తున్నారు. ఎన్నికలు ముగిసే వరకూ మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంది.



తూమకుంట చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సెబ్, పోలీసు సిబ్బంది, కొడికొండ చెక్‌పోస్టులో ఆటోను తనిఖీ చేస్తున్న దృశ్యం

మచ్చుకు కొన్ని...

- కొడికొండ చెక్‌పోస్టు వద్ద బుధవారం రెండు కార్లు, గురువారం ఓ కారులో మద్యం తరలిస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నారు. ఇందులో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి విలాసవంతమైన కారులో ఆరు బాటిళ్ల (350ఎంఎల్) విదేశీ మద్యం అనంతపురానికి తీసుకెళుతూ పట్టుబడ్డాడు. సరిహద్దులో తనిఖీల విషయం తెలియక తాను పొరబాటు చేశానని, మొదటి తప్పిదంగా గుర్తించి తనను వదిలేయాలని అభ్యర్థించినా సెబ్ అధికారులు వినలేదు. రూ.2.50 కోట్ల విలువైన కారు సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అలాగే మరో రెండు కార్లలో తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకుని వాహనాలను సీజ్ చేశారు.
- ఈ ఏడాది జనవరి 28న కర్ణాటక నుంచి హిందూపురం మండలం తూమకుంట చెక్‌పోస్టు దాటి చింతలపల్లి మీదుగా అడ్డదారిలో 17 బాక్సుల్లో తరలిస్తున్న 1,632 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ సీఐ రాజశేఖరరెడ్డి, సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు లేపాక్షి వద్ద 20 బాక్సుల టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లోనూ పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం తరలింపునకు అనుమతులు లేవు

గోవా, కర్ణాటక ప్రాంతాల నుంచి మద్యం ఆంధ్రాలోకి తరలిరాకుండా చెక్‌పోస్టుల్లో పటిష్ట చర్యలు చేపట్టాం. ఒక్క బాటిల్ కూడా తీసుకు రావడానికి అనుమతుల్లేవు. పొరపాటున ఎవరైనా తీసుకువస్తే కేసు నమోదు చేస్తాం. అయితే విదేశాల నుంచి వచ్చే వారు ఆ దేశ మద్యానికి సంబంధించి కస్టమ్స్ డ్యూటీ చెల్లించిన రసీదు కలిగి ఉంటే రెండు బాటిళ్ల వరకు అనుమతిస్తున్నాం. – రాజశేఖరగౌడ్, సెబ్ సీఐ, హిందూపురం

నగదు, మద్యం తరలిరాకుండా గట్టి నిఘా

కర్ణాటక నుంచి మద్యం, నగదు అక్రమంగా జిల్లాలోకి తరలిరాకుండా 24 గంటలూ గట్టి నిఘా ఉంచాం. వ్యాపారులు, ఇతరులు తప్పనిసరి పరిస్థితుల్లో నగదు తరలిస్తున్నప్పుడు సరైన దాఖలాలు దగ్గర ఉంచుకోవాలి. – కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

నేడు ఎన్నికల అధికారులకు ప్రత్యేక శిక్షణ

పుట్టపర్తి అర్బన్: రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉదయం ఎన్నికల అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందని డీఆర్‌ఓ కొండయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటలకు శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి నియోజకవర్గం సహాయ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొనాలన్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొని పలు సూచనలు చేయనున్నట్లు చెప్పారు.

ఆదివాసీలకు మెరుగైన వైద్యం


మొబైల్ ఆస్పత్రి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు తదితరులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆశయాల మేరకు ఒడిశాలోని ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కృషి చేస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు పేర్కొన్నారు. ఒడిశాలోని రాయఘడ్, కోరాపుత్, కలహండీ జిల్లాల్లోని ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేసిన మొబైల్ వాహనాన్ని గురువారం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తితో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం మొబైల్ ఆస్పత్రి వాహనాన్ని ఒడిశా సత్యసాయి సేవాదల్ బృందానికి అప్పగించారు.

రోడ్డు స్కేటింగ్ విజయవంతానికి సహకారం


రమణ మహర్షి అనాథ ఆశ్రమ విద్యార్థులతో అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'ఆడపిల్లలను చదివిద్దాం – ఆడపిల్లలను రక్షిద్దాం, ప్లాస్టిక్ కవర్లను నిషేదిద్దాం – భూగర్భ జలాలను కాపాడుదాం, అనాథలను ఆదరిద్దాం – బాల కార్మిక వ్యవస్థను నిరోదిద్దాం' అనే నినాదాలతో ప్రజలను చైతన్యపరిచేందుకు తాడిప్రతిలోని రమణ మహర్షి అనాథ ఆశ్రమ విద్యార్థులు చేపట్టిన రోడ్డు స్కేటింగ్‌ను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 750 కిలోమీటర్ల రోడ్డు స్కేటింగ్ చేపట్టిన విద్యార్థులను గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె అభినందించారు. ఆశ్రమ కార్యదర్శి రమణ మహేష్, స్కేటింగ్ కోచ్ మధు మాట్లాడుతూ.. ఆశ్రమ విద్యార్థులు ఏడుగురు ఈ నెల 12న తెల్లవారుజాము 5గంటలకు తాడిపత్రి నుంచి బయలుదేరి గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, అనంతపురం, లేపాక్షి, హిందూపురం, మడకశిర, ధర్మవరం మీదుగా తాడిపత్రికి చేరుకుంటారన్నారు. తమ మార్గంలోని ప్రతి గ్రామం, పట్టణాల్లో ఆడపిల్లల సంరక్షణ, ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలను చైతన్య పరుస్తారన్నారు. మొత్తం ఈ ప్రక్రియ ద్వారా వజ్ర వరల్డ్ రికార్డు, హిందుస్తాన్ రికార్డు, ఏషియన్ కాంటినెంటల్ రికార్డు, వజ్ర నేషనల్ రికార్డును నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కేటింగ్ సౌత్ జోన్ కార్యదర్శి బి.ప్రతాప్, విద్యార్థులు ఇషాక్, యోగేంద్ర, పృథ్వీ, రామ్‌చరణ్, భార్గవ, శ్రీరామ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన పోలీస్ అధికారులు


ఎస్పీ మాధవరెడ్డిని కలిసిన ఆర్‌ఐ రవికుమార్

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన పోలీస్ అధికారులు విధుల్లో చేరి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీపై వచ్చిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఐ) రవికుమార్, హిందూపురం టూటౌన్ ఎస్‌ఐ వెంకటరమణలు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్‌ఐ రవికుమార్ కర్నూలు జిల్లా నుంచి విచ్చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి శాయశక్తులా కృషి చేయాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా ఎన్నికలను నిర్వహించాలన్నారు.

పీఆర్ అధికారులకు అదనపు బాధ్యతలు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న ఎనిమిది మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు చూస్తున్న ఈఓలు, ఈఓఆర్‌డీలకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎనిమిది మండలాలకు ఎంపీడీఓల కొరత ఏర్పడింది. దీంతో పాలనా సౌలభ్యం కోసం ఆయా మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్న పరిపాలనా అధికారులు, ఈఓఆర్‌డీలకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ చర్యలు తీసుకున్నారు. అదనపు బాధ్యతలు స్వీకరించే వారిలో జిల్లాకు సంబంధించి ఎస్.అశోక్‌కుమార్ (అమడగూరు), వీవీ సిద్దారెడ్డి (కొత్తచెరువు), ఎల్.రామ్‌కుమార్ (చిలమత్తూరు), డాక్టర్ పీకే కేశవరెడ్డి (రొద్దం), ఆర్‌వీవీజీ ప్రసాద్ (రొళ్ల) ఉన్నారు.

కలుషిత ఆహారంతో 40 మందికి అస్వస్థత

సోమందేపల్లి: మండలంలోని బూసయ్యగారిపల్లిలో కలుషిత ఆహారం తిని 40 మంది అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి గ్రామంలోని ఓ ఇంట జరిగిన వైకుంఠ సమారాధనలో ఈ ఘటన చోటు చేసుకుంది. భోజనం ముగించుకున్న కాసేపటికే వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న 40 మందిని కుటుంబసభ్యులు పెనుకొండ, హిందూపురంలోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీం, వైద్య బృందం గురువారం ఉదయం గ్రామంలో పర్యటించింది. పెనుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. కల్తీ నూనె వినియోగించడంతో ఆహారం కలుషితమై ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

కర్ణాటకలో కొత్తచెరువు విద్యార్థి ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం (కర్ణాటక): పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన మణిదీప్ (19) దొడ్డబళ్లాపురంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయి. దీంతో కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ వచ్చిన మణిదీప్... బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లకుండా సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని సిమెంటు ఫ్యాక్టరీ వరకూ నడుచుకుంటూ వెళ్లి అక్కడ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చెక్క మగ్గాల తయారీ దుకాణం దగ్ధం


మంటల్లో కాలుతున్న మగ్గాల పరికరాలు

ధర్మవరం అర్బన్: స్థానిక కదిరి గేట్ సమీపంలో ఉన్న చెక్క మగ్గాల తయారీ దుకాణం బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ధర్మవరానికి చెందిన సుబ్రహ్మణ్యం 35 ఏళ్లుగా చెక్క మగ్గాలు, దోనెలతో పాటు మగ్గానికి సంబంధించిన పరికరాలను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దుకాణం మొత్తం కాలి బూడిదైంది. గురువారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసింది. 350 మగ్గం దోన్లు, యంత్ర పరికరాలు, మగ్గాలు ఇతర చెక్క పరికరాలు కాలిబూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.12లక్షల మేర నష్టవాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చేపల వేటకు వచ్చి కర్ణాటక వాసి మృతి

అమరాపురం: మండలంలోని నిద్రఘట్ట గ్రామ చెరువులో చేపల వేటకు వచ్చిన కర్ణాటక వాసి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు నిద్రఘట్ట చెరువులో చేపల వేట వేలం దక్కించుకున్న వ్యక్తి వద్ద కర్ణాటకలోని హిరియూరు తాలూకా పెనకనహళ్లికి చెందిన ఉప్పర శ్రీనివాస్ (46), ఆయన సోదరుడు మూడ్ల గిరియప్ప కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం చేపల వేటకు కుమారుడు రాకేష్, గిరియప్పతో కలసి ద్విచక్ర వాహనంపై చెరువు వద్దకు చేరుకున్న శ్రీనివాస్ చేరుకున్నాడు. అనంతరం రాకేష్ వెనుదిరిగిపోయాడు. ఇద్దరూ చేపల వేట కొనసాగించి సాయంత్రం ఒడ్డుకు చేరారు. ఈ క్రమంలో దాహం వేస్తుండడంతో గిరియప్పకు తెలిపి చెరువు వద్దకెళ్లిన శ్రీనివాస్ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో గిరియప్ప అక్కడకెళ్లి పరిశీలించాడు. అప్పటికే విగతజీవిగా ఒడ్డున పడి ఉన్న శ్రీనివాస్‌ను గమనించి వెంటనే సమాచారం అందించడంతో స్థానికులు వెళ్లి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలికపై టీడీపీ నేత కుమారుడి అత్యాచారం

- గర్భం దాల్చడంతో రాజీకి రావాలంటూ బెదిరింపులు

పుట్టపర్తి: బాలికపై టీడీపీ నేత కుమారుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒకటి రెండు సార్లు కాదు.. నెలల తరబడి తన శారీరక అవసరాలు తీర్చుకుంటూ వచ్చాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చడంతో విషయం బయటకు పొక్కకుండా భయపెట్టి రాజీ చేసేందుకు టీడీపీ పెద్దలు సిద్ధమయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం రామసాగరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి కుమారుడు అఖిల్ అదే గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిపై కన్నేశాడు. బాలిక తల్లిదండ్రులు ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లడంతో అవ్వ వద్ద ఉంటూ పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో ఓ రోజు అఖిల్ అడ్డుకుని భయపెట్టి లొంగదీసుకున్నాడు. ఆ తర్వాత తన శారీరక అవసరాలు తీర్చుకునేందుకు చిన్నారికి రోజుల తరబడి నరకం చూపాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన బాలికను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న అఖిల్‌ను తండ్రి దాచేసి, బాలిక కుటుంబ సభ్యులకు డబ్బు ఎరగా వేసేందుకు ప్రయత్నించాడు. వారు ఒప్పుకోక పోవడంతో టీడీపీ పెద్దలు రంగంలోకి దిగారు. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించకుండా బెదిరింపులకు దిగారు. తాము చెప్పినట్లుగా వినకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ దుప్పటి పంచాయితీకి తెరలేపారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ టీడీపీ నేతలు పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ ఘటనపై పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్యను వివరణ కోరగా, బాలిక తరఫు నుంచి ఇప్పటి వరకూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జల్సాలు చేసేందుకు నేరాలు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- 24 ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న అనంతపురం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం: జల్సాలకు అలవాటు పడిన కొందరు యువకులు తమ అవసరాలు తీర్చుకునేందుకు నేరాల బాటపట్టారు. పార్కింగ్ స్థలాల్లో నిలిపిన వాహనాలను అపహరించుకెళ్లి, విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, 24 ద్విచక్ర వాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు.

అంతర్రాష్ట్ర దొంగలుగా మారి...

అనంతపురంలోని నాల్గో రోడ్డుకు చెందిన నరేష్, ధర్మవరం పంగల్‌రోడ్డు సమీపంలోని తిరుమల డెయిరీ సమీపంలో నివాసముంటున్న మహేంద్ర, ఇటుకలపల్లికి చెందిన నానికుమార్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు... మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారారు. ఈ క్రమంలో తమ జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం వాహనాల చోరీకి తెరలేపారు. ఆర్టీసీ బస్టాండ్, సర్వజనాస్పత్రి, తదితర రద్దీ ప్రాంతాల్లో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళం సాయంతో అపహరించుకెళ్లి, తక్కువ ధరకు విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు తీర్చుకునేవారు. ఏడాదిన్నర కాలంలో అనంతపురం టూటౌన్, త్రీ టౌన్, తాడిపత్రి, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, బత్తలపల్లి, కర్ణాటకలోని బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో వీరు ద్విచక్ర వాహనాలు అపహరించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువులో ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను అపహరించి కళ్యాణదుర్గంలో తక్కువ ధరకే విక్రయించారు. వాహనాల దొంగతనం కోసం ఎక్కడికి వెళ్లాలనుకున్నా వీరు అద్దె కారును వినియోగించేవారు. ద్విచక్ర వాహనాల చోరీ కేసుల దర్యాప్తును ఛాలెంజ్‌గా స్వీకరించిన ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు అనంతపురం సీసీఎస్, టూటౌన్ సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, జనార్దన్, క్రాంతికుమార్, ఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ బయన్న, శ్రీనివాసులు, తిరుమలేష్, కానిస్టేబుళ్లు రంజిత్, శ్రీధర్ ఫణి, వన్నూరు, దాస్, ఆసీఫ్ ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. అందిన పక్కా సమాచారంతో గురువారం ఉదయం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం 24 ద్విచక్ర వాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.21 లక్షలు ఉంటుంది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు మైనర్లను జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక...

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ద్విచక్ర వాహనాల దొంగగా మారిన యువకుడిని కళ్యాణదుర్గం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేసి, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని అనంతపురంలోని చంద్రబాబు నగర్‌కు చెందిన పోతుల జాన్‌గా గుర్తించారు. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఇబ్బంది పడుతున్న తనను వడ్డీ వ్యాపారులు తీవ్రంగా వేధిస్తుండడంతో ద్విచక్ర వాహనాలు అపహరించి, సొమ్ము చేసుకుని అప్పులు తీర్చాలని భావించినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఈ క్రమంలో ఐదు రకాల కంపెనీలకు చెందిన ద్విచక్ర వాహనాల నకిలీ తాళాలను సేకరించి, రెండు నెలలుగా కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రిలో పార్కింగ్ చేసిన ఐదు వాహనాలను అపహరించుకెళ్లినట్లు వివరించాడు. వీటిపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో అనంతపురంలోని బైపాస్ వద్ద మారుతీ వే బ్రిడ్జి వద్ద తచ్చాడుతున్న పోతుల జాన్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.5 లక్షలు విలువ చేసే ఐదు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన, అనంతపురం, కళ్యాణదుర్గం పోలీసులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.